TGTEL/25/A3750

# నిజాయితీ

... నిజమే ...

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 18 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . బుధవారం 03 డిసెంబర్ 2025 వెల 4:00

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.

## బాచుపల్లిలో ఇద్దరు ఇంటర్

# విద్యార్థుల ఆత్మహత్య

**హైదరాబాద్, డిసెంబర్ 02 (నిజాయితీ)**

హైదరాబాద్ లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న వీరు ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న 16 ఏళ్ల విద్యార్థిని కళాశాలలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె సొంతూరు నారాయణ పేట జిల్లా మక్తల్ గ్రామం. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక గాంధీ ఆస్పత్రికి తరలించారు.


**ప్రగతినగర్‌లో మరో విద్యార్థి..**

మరో ఘటనలో బాచుపల్లి పీఎస్ పరిధి ప్రగతి నగర్‌లోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉరి వేసుకున్న అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవపరీక్షల కోసం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఇదిలా ఉంటే.. బాచుపల్లి పీఎస్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇంటర్మీడియట్ సెకండీయర్ చదువుతున్న మంజునాథ్ (15) అనే విద్యార్థి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య



చేసుకున్నాడు. అతడి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. తమ కాలేజీలో చదువుతున్న ఫస్ట్ ఇయర్ విద్యార్థినిని మంజునాథ్ ప్రేమిస్తుడాని.. ఈ విషయం తెలిసి అమ్మాయి కుటుంబ సభ్యులు బెదిరించడంతోనే మంజునాథ్ బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంగమ్మ గెలుపు కోసం మరిన్ని వ్యూహాలు



**లింగాల, డిసెంబర్ 02 (నిజాయితీ) :** లింగాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కెటి తిరుపతయ్య గారి సతీమణి శ్రీమతి మంగమ్మ గారి విజయం కోసం రాజకీయ వైశమ్యాలకు దూరంగా ఉత్సాహవంతమైన కదలికలు తెర మీదికొస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు ఎదురు చూసిన ఒక సరైన నాయకుడిగా అత్యంత సామాజిక స్పృహతో నిస్వార్థంగా వ్యవహరించే వ్యక్తికి వచ్చిన ఈ అవకాశం ఏమాత్రం చేజారకుండా జాగ్రత్తగా ఎన్నికల ఫలితం చూడాలని స్థానిక యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు సైతం ఎవ్వరికి వారు మంగమ్మ గెలుపుకోసం స్వంత ప్రణాళికలను సిద్ధం చేకుంటున్నారు. ఫలితం ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సి ఉంది.

## గ్లోబల్ సమ్మిట్ కోసం ఏర్పాట్లు వేగవంతం.. ఉన్నతాధికారులకు సీఎస్ కీలక ఆదేశాలు




**హైదరాబాద్, డిసెంబర్ 02 (నిజాయతీ) :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్‌లో జరగనుంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ఈ సమ్మిట్ జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో సీఎస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. దేశ విదేశాల ప్రముఖులకు, అతిథులకు ఆహ్వానాలు పంపించామని వారికి అన్ని సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించాలని సూచించారు. ఈ అతిపెద్ద సమ్మిట్‌లో అన్ని ప్రభుత్వ శాఖలు తమ పురోగతిని ప్రతిబింబించాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఒప్పందాలు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

**సమ్మిట్ ప్రధాన ఉద్దేశం: 3 ట్రిలియన్ ఎకానమీ దిశగా**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మార్చడం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఈ సమ్మిట్‌లో ఆవిష్కరిస్తారు.

రాబోయే 20 సంవత్సరాలలో తెలంగాణను ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేర్చడం ప్రధాన లక్ష్యం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రపంచంలోని 500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీలు, 2,000 పైగా వ్యాపార నాయకులు నిపుణులు ఈ సమ్మిట్‌కు హాజరవుతున్నారు.

## బయలు వీరభద్రస్వామికి

# ప్రదోషకాల అభిషేకం



**శ్రీశైలం (నిజాయితీ):** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీ బయలువీరభద్రస్వామివారికి ఈ రోజు సాయంత్రం దేవస్థానం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతీ మంగళవారం, అమావాస్య రోజున జరిగే ఈ విశేష అభిషేకం, అర్చనలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని దేవస్థాన అధికారులు తెలిపారు.శివభక్తుల అధిపతిగా పరిగణించే బయలువీరభద్రస్వామివారు ఆలయ నిర్మాణం లేకుండా బయలుపట్టునే దర్శనమిస్తారు. దశభుజులతో, ఆయుధాలతో, కిరీట మకుటంతో వెలిగే స్వామివారి వద్ద కుడివైపున దక్షుడు, ఎడమవైపున భద్రకాళి దర్శనమిస్తారు. ఈ దర్శనంతో క్లిష్టసమస్యలు తొలగి, వ్యాధినాశనం, ఆయురారోగ్యాలు కలుగుతాయని ప్రజానమ్మకం. క్షేత్రపాలక పూజకు ఆగమశాస్త్రాలలో విశేష ప్రాధాన్యం ఉంది. మంగళవారం, ఆదివారం, అమావాస్య రోజుల్లో చేసే వీరభద్రపూజ సర్వ గ్రహ దోష నివారణతో పాటు సంతాన, ఐశ్వర్యప్రాప్తికి కారణమవుతుందని పండితులు చెబుతున్నారు.పంచామృతం, బిల్వోదకం, కుంకుమ, హరిద్ర, భస్మ, గంధ, పుష్పోదకాలు, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నట్లు దేవస్థానం వెల్లడించింది.


## ఎన్నికల సంస్కరణలపై

# వచ్చే వారంలో చర్చ

**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాల రెండోరోజైన మంగళవారం కూడా పార్లమెంటులో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పై విస్తృత చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టంతో తలెత్తిన ప్రతిష్టం భనకు ఎట్టకేలకు తెరపడింది. కేవలం ఎస్ఐఆర్ పైనే కాకుండా ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చకు తాము సిద్ధంగా ఉన్నట్టు కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే ఎస్ఐఆర్‌పై వెంటనే చర్చ జరగాలని ఉభయసభల్లోనూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. చర్చకు తాము సిద్ధమేనని, అయితే గడువు పెట్టవద్దని విపక్షాలను కేంద్రం కోరింది. బీఏసీలో నిర్ణయించిన ప్రకారం 'వందే మాతరం'పై తొలుత చర్చ జరగాలని, ఆ తర్వాత అన్ని ముఖ్యమైన అంశాలపైనా చర్చించవచ్చని ప్రభుత్వం సూచించింది. ఈనెల 7వ తేదీతో వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నందున దీనిపై తొలుత చర్చించేందుకే తాము ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించింది. కాగా, ఫ్లోర్ లీడర్లతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరిపారు.

## ఏపీలో మరో

# బస్సు ప్రమాదం



### తిరుపతి జిల్లాలో బోల్తా పడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు...

**హైదరాబాద్, డిసెంబర్ 02 (నిజాయితీ) :** తిరుపతి జిల్లాలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా, 10మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... కడప నుంచి బెంగళూరు వెళ్తున్న హరిత ట్రావెల్స్ బస్సు ఆంధ్రప్రదేశ్ – కర్ణాటక సరిహద్దులోని శ్రీనివాసపురం తాలూకా రాయల్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచినీళ్ల కోట్ వద్ద బోల్తా పడింది. బస్సు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో బస్సు బోల్తాపడినట్టుగా తెలుస్తోంది. ఈ ప్రమాదం మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో జరిగినట్టుగా చెబుతున్నారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.గాయపడినవారిలో వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. ఇక, ఈ ప్రమాదంలో మరణించిన మహిళను ప్రొద్దుటూరు కు చెందిన అనితగా గుర్తించారు. గాయపడినవారిలో కడప, రాయచోటి, బెంగుళూరుకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాద ఘటనపై రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఇదిలాఉంటే, ఇటీవల ఏపీలో కర్నూలు సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు అక్టోబర్ 24 తెల్లవారుజామున కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. రోడ్డుపై అప్పటికే ప్రమాదానికి గురై పడిపోయి ఉన్న బైక్ (శివశంకర్‌కు చెందిన బైక్)ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టి లాక్కెళ్లడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో 19 మంది మరణించారు.

